క్లుప్తంగా

ఎంఈవో తీరు మార్చుకోవాలి

టెక్కలి: టెక్కలి ఎంఈవో తులసీరెడ్డి తీరు మార్చుకోవాలని కోరుతూ ఉపాధ్యాయుల ఐక్య వేదిక సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఉప విద్యా శాఖాధికారి పి.విలియమ్స్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులను నానా దుర్భషలాడుతూ అవమానపరుస్తున్న ఈయన తీరు మార్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులతో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఏటీఎఫ్, ఆపస్, పీఆర్‌టీయూ, ఏపీసీపీఎస్ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయానికి పడమర దిక్కునుంచి వెళ్లేందుకు అవసరమైన మున్సిపాలిటీ మార్గంలో రెండు చోట్ల జరిగిన ఆక్రమణలను భవిష్యత్ దృష్ట్యా తొలగించాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యులు కట్టా సూర్యప్రకాశరావు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.

మౌలిక వసతులు కల్పించండి

- లచ్చన్నపేట వాసుల విజ్ఞప్తి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

టెక్కలి: పోలవరం పంచాయతీ లచ్చన్నపేట గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని యువకులు కోరారరు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవోకు ఎం.కృష్ణమూర్తికి సోమవారం వినతి పత్రం అందజేశారు. సరైన రోడ్డు లేకపోవడంతో గోతుల రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నామని, తాగడానికి మంచినీటి సదుపాయ కల్పించాలని, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా వినతులు వెల్లువెత్తాయి. యశ్వంత్‌కుమార్ రెడ్డిని మరణా ఐటీడీఏ పీవోగా కొనసాగించవద్దని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు కె.శ్రీను, జి.రమణమూర్తి, లక్ష్మీనారాయణ ఆర్డీవోకు విన్నవించారు. వివిధ శాఖలకు సంబంధించి 36 అర్జీలు అందినట్లు సిబ్బంది వెల్లడించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కంచిలి: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉద్దానం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రం కంచిలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదాతలు నవజీవన స్ఫూర్తిదాతలు, రక్తదాతలే నిజమైన దేవుళ్లు అనే స్ఫూర్తితో యువత సహృదయంతో ముందుకు రావాలని కోరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ఈ శిబిరానికి స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- డ్వామా పీడీ సుధాకరరావు



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ సుధాకరరావు

ఇచ్ఛాపురం రూరల్: పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తీరప్రాంతల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు ఐదు రోజుల పాటు సముద్రంలో వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డ్వామా ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ కె.రామారావు, ఉప తహసీల్దార్ బి.శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కూన విష్ణుమూర్తి, ఇరిగేషన్ ఏఈ పాణిగ్రాహి పాల్గొన్నారు.

నీటమునిగిన పంటపొలాలు



ఇచ్ఛాపురం రూరల్: నీట మునిగిన డొంకూరు పంట పొలాలు

ఇచ్ఛాపురం రూరల్/ఇచ్ఛాపురం: మోస్తారు వర్షాలకు బూర్జపాడు, డొంకూరు, లక్ష్మీపురం ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. బహుదానదిలో వరద నీరు చేరడంతో బూర్జపాడు చానెల్ నిండుకొని పొంగి పొర్లింది. దీంతో వరి నాట్లు నీటిలో మునిగిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షానికి మండలంలో పూర్తి స్థాయిలో నాట్లు వేసేందుకు అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి పీపీవీవీ అజేయ్‌కుమార్ తెలిపారు. అలాగే ఇచ్ఛాపురం పట్టణంలో సోమవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



లింగాలపాడు వద్ద రోడ్డు దుస్థితి



పూండికి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యి

చినుకు పడింది రోడ్డు పాడైంది!

- అస్తవ్యస్తంగా బెండిగేటు–పూండి–నౌపడ ప్రధాన రహదారి

వజ్రపుకొత్తూరు:

రెండు రోజులుగా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకే రోడ్లు ఛిద్రమయ్యాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్లను పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు అనుసంధానంగా ఉన్న బెండిగేటు–పూండి–నౌపడ రహదారి వర్షాలకు పాడైంది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడడంతో వర్షం నీరు చేరి చెరువును తలపిస్తోంది. తాము అధికారంలోకి వచ్చిట వెంటనే రహదారుల నిర్మాణం పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు అధికారం చేపట్టిన తరువాత మాత్రం తోక ముడిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలాస వచ్చిన సందర్భంలో బెండిగేటు–పూండి–నౌపడ రహదారికి రూ. 60 కోట్లు వరకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో కూటమి సర్కారు ఈ రహదారిని గాలికొదిలేసింది. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా నిర్మించాలని కోరుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దగ్గరకు వెళ్లి విజ్ఞప్తి చేసిన పలాస నియోజకవర్గ కూటమి నాయకులు నిధులు తెచ్చి పనులు చేపట్టడంలో విఫలమైయ్యారు.



బెండిగేటు–పూండి మధ్య కవిటగ్రహారం సమీపంలో ఛిద్రమైన రోడ్డు

ప్రస్తుతం ఈ రహదారి నరకానికి నకళ్లుగా మారింది. రోడ్డుపై గుంతలు మడుగుల్లా ఉంటూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కనీసం రహదారికి ఇరువైపులా మట్టి బెర్ములు నిర్మించి మరమ్మతులైనా చేపట్టాలని వాహనచోదకులు బి.రాజేష్, కె.నారాయణ, ఎం.ప్రవీణ్, కె.దానేష్ కోరారు.



పూండి మూడు రోడ్ల కూడలి వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

మున్సిపాలిటీ..మురుగు పాలిటీ!

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని మురికివాడలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. సరైన కాలువలు, రోడ్లు లేక పోవడంతో మురుగునీరు పారక రోడ్లపైకి వచ్చి చేరింది. దీంతో మున్సిపాలిటీ కాస్తా మురుగుపాలిటీగా మారింది. ఎక్కడక్కక్కడ నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా పలాస నడిబొడ్డున ఉన్న శివాజీనగర్ కాలనీలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. అలాగే అక్కుపల్లి రోడ్డులో కూడా వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సూదికొండ కాలనీ, ఇందిరా కాలనీ రోడ్లపై నీరు నిలిచిపోయింది.



పలాస: చెరువును తలిపిస్తున్న, శివాజీనగర్ రోడ్డు



పలాస: సూదికొండ కాలనీ రోడ్డు

తీరప్రాంతంలో అధికారుల పర్యటన

వజ్రపుకొత్తూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీర ప్రాంతంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.వి.సీతారామయ్య సూచించారు. 11 తీర ప్రాంత పంచాయతీల్లో దండోరాలు వేయడంతో పాటు అక్కడ వీఆర్వోలను 24 గంటలు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కొత్తపేట, దేవునల్తాడ, మంచినీళ్లపేట, అక్కుపల్లి గ్రామాల్లో మత్స్యశాఖ అధికారులు పర్యటించారు. వేటకు వెళ్లరాదని, తీరంలోని బోట్లు, వలలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మత్స్యశాఖ సిబ్బంది ఉమాదేవి, సునీత, హరిగోవింద పాపారావు, సొసైటీ అధ్యక్షుడు గీత బాలరాజు ఉన్నారు.

సోంపేట: మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్ పృధ్విరాజ్ కుమార్ అన్నారు. ఉప్పలాం పంచాయతీ తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వేటకు వెళ్లవద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని మత్స్యకారులకు సూచించారు. ఆర్డీఓ వెంకటేష్, మండలస్థాయి అధికారులు ఉన్నారు.



వజ్రపుకొత్తూరు: కొత్తపేట తీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు



సోంపేట: మత్స్యకారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ పృధ్విరాజ్ కుమార్

నాయకుల పరామర్శ

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నేత పూడి రాజశేఖర్ (జగతి), బల్లిపుట్టుగకు చెందిన బి.కృష్ణారావు భార్య రోజా, బిగొనవపుట్టుగ పంచాయతీకి చెందిన లొట్టి రమణమ్మలను పరామర్శించి సంతాపం తెలిజేశారు.

కంచిలి: బొనమాళి గ్రామానికి చెందిన ఉమ్మడి వెంకయ్య, బొగాబెణి గ్రామానికి చెందిన కనుసు నిర్మలమ్మల ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పరామర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తలగాన తిరుపతిరావు, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, స్థానిక నేతలు కుణితి తిరుపతిరావు, గణప రామారావు ఉన్నారు.

ఎం.తోటూరులో కార్డన్ సెర్చ్

ఇచ్ఛాపురం రూరల్: తోటూరులో ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో ధ్రువీకరణ పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు.



కార్డెన్ సెర్చ్‌లో పోలీసు సిబ్బంది

మంత్రికి పట్టని రైతు సమస్యలు



రైతుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న పేరాడ తిలక్, నాయకులు

- టెక్కలిలో రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన
- మంత్రి అచ్చెన్నాయుడు డౌన్..డౌన్ అంటూ నినాదాలు
- నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ర్యాలీ



ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న పార్టీ శ్రేణులు

టెక్కలి: వ్యవసాయ శాఖ మంత్రిగా, టెక్కలి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న అచ్చెన్నాయుడు రైతు సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. రైతుల సమస్యలు పట్టించుకోని అచ్చెన్నాయుడు డౌన్.. డౌన్ అంటూ సోమవారం టెక్కలిలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులంతా జోరు వానలో పెద్ద ఎత్తున ర్యాలీ కొనసాగించారు. పాతబస్‌స్టాండ్ వద్ద తిలక్‌తో పాటు నాయకులంతా రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అన్నదాత కష్టాలను పట్టించుకోని అచ్చెన్నాయుడు డౌన్ డౌన్, కూటమి కార్యకర్తల ఎరువుల దోపిడీ అరికట్టాలని, రైతుల బీమాను ప్రభుత్వమే చెల్లించాలి, రైతులకు సరిపడా ఎరువులు అందజేయాలని, శివారు ప్రాంత ఆయకట్టుకు సాగునీరు అందజేయాలి, ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలతో కూడిన ప్లకార్డులతో ర్యాలీ కొనసాగించారు. ర్యాలీని అడ్డుకోవడానికి పోలీసులు చేసిన ప్రయత్నాన్ని తిప్పికొడుతూ ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీను కొనసాగించారు. అనంతరం ఆర్డీవో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యులు పి.వసంత్‌రెడ్డి, డి.వెంకట్రావు, పార్టీ మండల కన్వీనర్లు హెచ్.వెంకటేశ్వర్రావు, ఎస్.హేమసుందర్‌రాజు, బి.మోహన్‌రెడ్డి, టి.ఫాల్గుణరావు, నాయకులు సత్తారు సత్యం, టి.కిరణ్, జి.గురునాథ్‌యాదవ్, పి.హేమలత, కె.అజయ్, రాములమ్మ, ఆర్.మల్లయ్య, వై.చక్రవర్తి, ఎస్.రామిరెడ్డి, ఎన్.భీమారావు, చిన్ని జోగారావు, బి.దివాకర్ , అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో మంత్రి వైఫల్యం

సొంత నియోజకవర్గంలో రైతుల సమస్యలను పరిష్కరించడంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘోరంగా వైఫల్యం చెందారని పేరాడ తిలక్ దుయ్యబట్టారు. వ్యవసాయంపై కనీసం అవగాహన లేకపోవడంతో గత రబీ నుంచి ఇప్పటి ఖరీఫ్ వరకు పూర్తిస్థాయిలో విత్తనాలు, ఎరువులు, సాగునీరు అందివ్వలేకపోయారని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అర్హులైన రైతులకు లేనిపోని కొర్రీలతో పథకం వర్తించకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రికి అనుకూలంగా ఉన్న ఎరువుల వ్యాపారస్తులకు అడ్డదారిలో ఎరువులను దోచిపెట్టారని మండిపడ్డారు. తక్షణమే రైతులకు అవసరమైన ఎరువులు, సాగునీరు అందజేయకపోతే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

‘దివ్యాంగులను హింసించడం తగదు’



దివ్యాంగుల ధర్నాకు సంఘీభావం తెలియజేస్తున్న పేరాడ తిలక్

టెక్కలి: దివ్యాంగులను మానసికంగా హింసించడం తగదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.వేణుగోపాల్ అన్నారు. టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఆవరణలో దివ్యాంగులతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సదరం రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు అనేక ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. పునఃపరిశీలన లో అర్హులైన వారికి పింఛన్ రాకుండా తొలగించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు ఉన్నటువంటి చట్టాలను పూర్తిగా తుంగలో తొక్కుతూ వారిని మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. సదరం రీవెరిఫికేషన్‌లో తొలగించిన పింఛన్లను తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌తో పాటు నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. ఎటువంటి ఆసరా లేని దివ్యాంగులకు ఉన్నటువంటి పింఛన్‌ను సైతం తొలగించడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేసిందన్నారు. తక్షణమే తొలగించిన పింఛన్లు అందజేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల వలయంలో.. సాంకేతిక విద్యాలయం!

- కానరాని మౌలిక సదుపాయాలు
- చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
- టెక్కలి పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి

నందిగాం:

టెక్కలి పేరుతో నందిగాం మండలం తురకల కోట సమీపంలో నడుపుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో ఉన్న ఈ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. 2013లో స్థాపించిన ఈ కళాశాలలో 2014–15 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు కల్పించినప్పటికీ శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలోనే తరగతులు నిర్వహించేవారు. 2017 జూన్‌లో ఇక్కడకు అధికారులు మార్పు చేశారు. టీడీపీకి చెందిన చౌదరి బాబ్జీ అల్లుడు కిశోర్‌కు చెందిన శివరామక్రిష్ణ ఇంజినీరింగ్ కాలేజీ (ప్రైవేటు) గా ఉండేది. అయితే ఇంజినీరింగ్ కాలేజీలో ప్రవేశా లు లేకపోవడంతో, నష్టాలతో నడుస్తున్న దాన్ని దాని యజమాని అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి అల్లుడు కావడంతో టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు ద్వారా అధిక ధర కు ప్రభుత్వం కొనుగోలు చేసేలా వ్యవహారం నడిపి సుమారు రూ. 10 కోట్లుకు విక్రయించారు. దీంతో శ్రీకాకుళం నుంచి పాలిటెక్నిక్ టెక్కలి పేరుతో ఇక్కడకు తరలించి తరగతులు ప్రారంభించారు. ప్రస్తు తం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు ఉండగా.. ప్రతి కోర్సుకు 59 సీట్లు అందుబాటులో ఉంచి కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. అయితే సరైన సదుపాయలు లేకపోవడం, అధ్యాపకుల కొరత, కనీసం మంచినీటి సౌకర్యం లేకపోవడం, మారుమూల ప్రాంతంలో ఉండటం, హాస్టల్ వసతి లేనికారణంగా ఈ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు మొగ్గు చూపడంలేదు. ప్రధానంగా బాలికలను ఇక్కడ చేర్పించేందుకు వారి తల్లిదండ్రులు సుముఖంగా ఉండటం లేదు.



నేమ్‌బోర్డు కూడా లేని టెక్కలి పాలిటెక్నిక్ కాలేజీ

ప్రస్తుతం ఇక్కడ ఉన్న విద్యార్థులు-గ్రూపులవారీగా..

	ఈఈఈ	సివిల్
మొదటి ఏడాది	28	04
రెండవ ఏడాది	14	03
మూడవ ఏడాది	21	02



తోటల మధ్య నుంచి కాలేజీకు వచ్చే రహదారి

ఫలితంగా ఈ ఏడాది కూడా పూర్తిస్థాయి సీట్లు భర్తీ కాలేదు.

సిబ్బంది కొరత..

పాలిటెక్నిక్ కాలేజీలో టీచింగ్ విభాగంలో ఒక ప్రిన్సిపాల్, ఇద్దరు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌లు, ఇద్దరు సీనియర్ లెక్చరర్లు, పదిమంది లెక్చరర్లు మొత్తం 14 మంది ఉండాలి. అయితే ప్రిన్సిపాల్, ఈఈఈ బ్రాంచ్‌కు ఒకరు, సివిల్ బ్రాంచ్‌కు ఒకరు, ఇంగ్లిష్‌కు ఒకరిని డిప్యుటేషన్‌పై వేరే కాలేజీల రెగ్యులర్ సిబ్బందిని ఇక్కడ నియమించి తరగతులు నడుపుతున్నారు. అలాగే నాన్ టీచింగ్ విభాగంలో ఏవో, ఆఫీస్ సూపరింటెండెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు ఆఫీస్ సబార్డినేట్లు, ముగ్గురు స్వీపర్లు, ఇద్దరు వాచ్‌మ్యన్లు, ముగ్గురు ల్యాబ్ అటెండర్లు ఉండాలి. అయితే ఒక్కరూ కూడా లేకపోవడంతో అన్ని పనులు ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులే చేసుకోవల్సి వస్తుంది.

కాలేజీ మారిపోతున్నారు..



ఇక్కడ విద్య బాగున్నప్పటికీ సదుపాయాల్లేవు. ఈ కారణంగానే కౌన్సెలింగ్‌లో ఈ కాలేజీ ఎలాట్ అయిన విద్యార్థులు కూడా రెండో విడత కౌన్సెలింగ్‌లో వేరే కాలేజీకి మారిపోతున్నారు. ఇక్కడ పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి, హాస్టల్ సదుపాయం కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

–డాక్టర్ డి.సింహాచలం, ప్రిన్సిపాల్

స్కాలర్‌షిప్ రావడం లేదు



సదుపాయాల్లేని ఈ కాలేజీలో చేరిన నాలాంటి పేద విద్యార్థులకు హాస్టల్ లేదు సరికాదా స్కాలర్ షిప్ కూడా రావడం లేదు. కనీసం శుద్ధ తాగునీరు కూడా ఉండటం లేదు. మైదానం అంతా పిచ్చిమొక్కలతో నిండి ఉండటంతో ఇబ్బందిగా ఉంది. కాలేజీ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలి.

–లాడి భార్గవ్, థర్డ్ ఇయర్, ఈఈఈ

అధ్యాపకులను నియమించాలి



ఇక్కడ అరకొరగా చదువుతున్నవారంతా నిరుపేద విద్యార్థులే. ఈ పాలిటెక్నిక్ కాలేజీలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించి విద్యార్థులకు మేలుచేయాలి. సిబ్బంది లేని కారణంగా అన్ని సబ్జెక్టుల బోధన జరగడ లేదు.

–దేవాది భార్గవ్, ద్వితీయ సంవత్సరం, సివిల్ ఇంజినీరింగ్

హాస్టల్ సౌకర్యం కల్పించండి



జాతీయ రహదారికి కిలో మీటర్ దూరంలో ఉన్న ఈ కాలేజీలో చదవాలంటే తప్పనిసరిగా హాస్టల్ సదుపాయం ఉండాలి. ఇక్కడ హాస్టల్ లేని కారణంగా దూరంగా ఉన్న ప్రైవేటు హాస్టల్‌లో ఉండవలసి వస్తుంది. దీనివలన చాలామంది ఈ కాలేజీలో చేరకుండా వేరే కాలేజీలకు వెళ్లిపోతున్నారు. అధికారులు దృష్టిసారించి వసతి సౌకర్యం కల్పించాలి.

–కేత లక్ష్మణరావు, ద్వితీయ సంవత్సరం, ఈఈఈ

రైల్వే గేటు కష్టాలు

ఉద్దానం ప్రాంతం వాసులకు తాళబద్ర రైల్వే గేటు వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. పలాస–కాశీబుగ్గ పట్టణాలకు పనుల మీద ఈ ప్రాంత వాసులు రాత్రి పగలు తేడా లేకుండా వెళ్తుంటారు. ఒకసారి గేటు పడితే కనీసం గంటసేపు సమయం వృథా అవుతుంది. రెండు, మూడు రైళ్లు వెళ్లిన తర్వాత గానీ గేటు తెరుచుకోకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఉద్దానం వాసులు కోరుతున్నారు. –పలాస





పుస్తకావిష్కరణ

సాంకేతిక రంగంలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేయాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కళాశాలకు చెందిన డేటా సైన్స్ విభాగం అధ్యాపకులు తంగుడు నరేష్, సాహుకారి జయవర్ధన్‌రావ్, ఎస్.కళ్యాణ్, పి.ప్రియాంక సంయుక్తంగా రాసిన అల్గారిథమ్స్ ఫర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. –టెక్కలి

వ్యక్తికి ఆర్థిక సహాయం

సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామానికి చెందిన సూరాడ అప్పారావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇతనికి గ్రామస్తులు అండగా నిలిచారు రూ. 89 వేలు సేకరించారు. ఉమిలాడ గ్రామస్థులు రూ. 73 వేలు, సీమన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూ. 10 వేలు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, మేరుగు అప్పారావులు రూ. 6 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని బాధితుడికి సోమవారం అందజేశారు. –సంతబొమ్మాళి

